క్లుప్తంగా

నేడు నిడదవోలు మున్సిపల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ కేవీ పద్మావతి బుధవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ



తాడిపర్రులో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠలో భక్తులు

ఉండ్రాజవరం: యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తాడిపర్రు గ్రామంలో నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలతో ఆలయ ఆవరణంలో హోమాలు చేశారు. వాయిద్యాల సందడిలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జూనియర్ కళాశాలకు నిధులివ్వాలి

గోపాలపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు మంజూరు చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ కళాశాల వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ మాట్లాడుతూ కళాశాల నిర్మించి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా హడావుడిగా కాలేజీని ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగే కొద్దీ కళాశాలలో సౌకర్యాలు కరవవుతున్నాయన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎస్కే మునీర్ బాషా, కార్యదర్శిగా ఆర్. జగదీష్, 12 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పాల ఉత్పత్తిని మరింతగా పెంచాలి

నల్లజర్ల: ప్రజావసరాల మేరకు పాల ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని, ఇందులో మహిళలు భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు ఎంపీడీఓ రాజశేఖర్ అన్నారు. జగనన్న పాలవెల్లువ అవగాహన కార్యక్రమాలు బుధవారం మండలంలోని పుల్లలపాడు, సింగరాజుపాలెం గ్రామాల్లో జరిగాయి. సింగరాజుపాలెం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ రాజశేఖర్ మాట్లాడుతూ నల్లజర్ల మండలం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కాబట్టి పాలఉత్పత్తి పెంచడానికి కూడా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో 100 మేలుజాతి గేదెల కొనుగోలుకు వివిధ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణ సహాయం అందించే ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం సెప్టెంబరు 1న నల్లజర్లలో మహిళా పాడి రైతులతో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల్లో పశుసంవర్ధక శాఖ ఏడీ మోజెస్ జాన్ వెస్లీ, అమూల్ సంస్థ సూపర్‌వైజర్ వివేక్, వైఎస్సార్ క్రాంతి పథం సీసీలు మాలిని, జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ సంతకాల సేకరణ

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలిపై పునరాలోచన చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల పాలకమండలిలో అన్యమతస్తులను చేర్చడాన్ని నిరసిస్తూ వారు బుధవారం స్థానిక గోష్పాద క్షేత్రంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, పట్టణ శాఖ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, రూరల్ మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, మట్లా ఆంజనేయులు, బూసి సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

కాలువలకు నీటి విడుదల పెంపు

నిడదవోలు: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఉభయ గోదావరి జిల్లాల్లోని పశ్చిమ డెల్టా పరిధిలోని రైతుల సాగు అవసరాల మేరకు నీటి విడుదలను అధికారులు క్రమబద్ధీకరిస్తున్నారు. ఇందులోభాగంగా నీటిపారుదల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను బుధవారం పెంచారు. పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని ఏలూరు కాలువకు 900, తణుకు కాలువకు 598, అత్తిలి కాలువకు 526, నరసాపురం కాలువకు 1947, ఉండి కాలువకు 900 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

4న చాగల్లు ఉప సర్పంచ్ ఎన్నిక

చాగల్లు: మండలంలోని చాగల్లు పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సెప్టెంబర్ 4న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ బుధ వారం తెలిపారు. ప్రస్తుత ఉప సర్పంచ్ ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్ రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. వార్డు సభ్యుల సమావేశంలో ఈ ఎన్నిక జరుగుతుందని ఆయన చెప్పారు.

పల్లెల అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు

- పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఊతం
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచులు



సింగవరంలో గ్రామ సచివాలయ భవనం

నిడదవోలు రూరల్: నాలుగున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో ఏ పంచాయతీ కూడా అభివృద్ధికి నోచుకోలేదు. సరికదా.. సరైన సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబ్బందులూ పడేవారు. గ్రామంలో ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ మంది ప్రభుత్వోద్యోగులు ఉండేవారు కాదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి గ్రామంలోనూ పది మందికి పైగా సచివాలయ సిబ్బందిని నియమించి పల్లెల్లోనే సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. అంతేగాకుండా ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీలకు పలు విడతలుగా నిధులను విడుదల చేశారు.

ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు

నిడదవోలు మండలంలోని 23 పంచాయతీల పీడీ ఖాతాలకు రూ.33,68,837 జమ అయ్యాయి. అంతేగాకుండా పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలోనే ఎప్పటికప్పుడు చెల్లించేలా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాలి. దీంతో లావాదేవీల వివరాల సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలుస్తుంది. ట్రెజరీ అనుమతులు, ఇతర ఉన్నతాధికారుల జోక్యం ఎక్కడా ఉండదని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఖర్చుకు విధివిధానాలు

పంచాయతీలకు జమ అయిన నిధులను అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, పంచాయతీ, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. వాటితో పాటు శ్మశానవాటికల అభివృద్ధికి, ఈ–పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడిభాగాల కొనుగోలుకు కూడా వినియోగించుకోవచ్చు. ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయితీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి ఊతం



15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలను మరింత అభివృద్ధి చేయవచ్చు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి మరమ్మతులతో పాటు పారిశుధ్య పనులను చేపట్టి పలు సమస్యలను పరిష్కరించవచ్చు. గ్రామాల అభివృద్ధితో పాటు సచివాలయాలు, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– తిక్కా శ్రీనివాస్‌రావు, సర్పంచ్, నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి, విజ్జేశ్వరం

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు



కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల పీడీ ఖాతాలకు జమ చేశాం. ఈ నిధులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచే సిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాలి. ఈ బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది.

– ఎస్.రత్నమాలిక, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ, నిడదవోలు

సీఎం జగన్‌ను కలిసిన శ్రీనివాస్‌నాయుడు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకకు బుధవారం ఆయన స్వగ్రామం ఇర్రిపాక విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.

– నిడదవోలు

మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- అట్లపాడులో అభివృద్ధి పనులకు శ్రీకారం



అట్లపాడులో జగనన్న కాలనీకి వెళ్లే గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: నియోజకవర్గ ప్రజలందరీ మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.44.65 లక్షల వ్యయంతో మండలంలోని అట్లపాడు గ్రామంలో నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, పైపులైన్లు, తాగునీటి కుళాయిల ఏర్పాటుకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే జెడ్పీ నిధులు రూ.20 లక్షల వ్యయంతో అదే గ్రామంలో నిర్మించే బీసీ సామాజిక భవనానికి కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆ గ్రామంలోని జగనన్న కాలనీకి వెళ్లేందుకు రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయడు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలో నిడదవోలులో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల సాకారం అవుతోందన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా మాజీ ఎమ్మెల్యే జీఎస్ రావు పేదలకు స్థలాలు అందించారని గుర్తు చేశారు. మళ్లీ నేడు సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హులైన ప్రతి పేదవాడికీ ఇంటిస్థలం మంజూరు చేసే అవకాశం తనకు దక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కోపల్లి అనంత లక్ష్మి సత్యవతి, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎన్ఎస్వీ తమ్మారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, నాయకులు కొయ్యే నరేష్, జాన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీఎంకు రాఖీ కట్టిన శ్రీలేఖ



తాళ్లపూడి: నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు బుధవారం తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ రాఖీ కట్టారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి తానేటి వనితతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి ఆమె రాఖీ కట్టారు.

ఇర్రిపాకలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కట్టిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ

సోదర ప్రేమకు ప్రతీక రక్షాబంధన్



ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న హోం మంత్రి తానేటి వనిత



మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు రాఖీ కడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు మంత్రి రాఖీలు కట్టి, మిఠాయిలు పంచారు. నాయకులందరికీ ఆమె రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె నియోజకవర్గంలోని నాయకులందరూ తనను ఒక సోదరిలా భావించి ఆశీర్వదిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లోనూ ముందుకు సాగుదామని సూచించారు. ఒక సోదరిగా మీ అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రతి ఒక్క సోదరుడి కష్టసుఖాల్లో తాను పాలు పంచుకుంటానన్నారు. అలాగే మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి కమిషనర్ బి. శ్రీకాంత్‌కు రక్షబంధన్ కట్టి స్వీట్లు ఇచ్చారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీల కొనుగోళ్లతో ఫ్యాన్సీ దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

ప్రభుత్వ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా పురస్కారం



క్రీడా ప్రతిభా పురస్కారం అందుకుంటున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మశ్రీ

కొవ్వూరు: 2022–23 సంవత్సరానికి జిల్లాస్థాయి క్రీడా ప్రతిభా పురస్కారాల్లో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నాలుగో స్థానం లభించింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో ఎస్.అబ్రహాం చేతుల ఈ పురస్కారం అందుకున్నట్టు ఆ హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.పద్మశ్రీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అప్పటి హెచ్‌ఎం , ప్రస్తుతం రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, ప్రస్తుత హెచ్‌ఎం పద్మశ్రీ , పాఠశాల వ్యాయమోపాధ్యాయుడు ఎస్.భాస్కర్‌లను సత్కరించారన్నారు. జిల్లావ్యాప్తంగా ఐదు పాఠశాలను క్రీడా ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారని పద్మశ్రీ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో కనబరుస్తున్న ప్రతిభకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించిందన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

- జిల్లా గవర్నర్ మాణిక్యాలరావు
- కొవ్వూరులో క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశం



కొవ్వూరులో లయన్స్ క్లబ్ మహిళా సభ్యులను సత్కరిస్తున్న గవర్నర్ మాణిక్యాలరావు తదితరులు

కొవ్వూరు: లయన్స్ క్లబ్ లక్ష్యాలకు అనుగుణంగా క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం కొవ్వూరు పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా నా మొక్క నా శ్వాస అనే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. క్లబ్ సభ్యుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు.క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు, కార్యదర్శి పెనుమాక జయరాజు, సభ్యులు యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పాలెంపాటి చినబాబు చౌదరి, పరిమి హరిచరణ్, కంఠమణి రామకిషోర్, ఉప్పులూరి రామకృష్ణ, కంఠమణి రమేష్ తదితరులు పాల్గొన్నారు. క్లబ్ తరపున జిల్లా గవర్నర్ మాణిక్యాలరావును ఘనంగా సత్కరించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా క్లబ్ మహిళా సభ్యులను గవర్నర్ మాణిక్యాలరావు చేతుల మీదుగా సత్కరించారు.

సర్రాజు చిత్రపటం ఏర్పాటు

పెరవలి: మండలంలోని తీపర్రులో గ్రంథాలయం ఏర్పాటుకు, అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రత్తిపాటి సర్రాజు చిత్ర పటాన్ని బుధవారం ఆ గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ గ్రామపెద్ద సింహాద్రి సత్యనారాయణ మాట్లాడుతూ 1969లో తీపర్రులో సర్రాజు యువజన సంఘం గ్రంథాలయాన్ని స్థాపించారన్నారు. ఆయన అక్కడితో విశ్రమించకుండా దానిని గ్రామీణ గ్రంథాలయంగా, శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి చేసేందుకు అవిరళ కృషి చేశారన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

నల్లజర్ల: రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఎదుట దస్తావేజు లేఖరులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు బుధవారం పెన్ డౌన్ ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరి మంచిరాజు రవి మాట్లాడుతూ ఫిజికల్ డాక్యుమెంట్ (ఒరిజినల్) లేకుండానే కార్డ్ ప్రైమ్ అనే నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా డిజిటలైజేషన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని రిజిస్టేషన్ శాఖ అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ విధానం వల్ల భూములు కొనుగోలు, అమ్మకందారులకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. అదీగాక దస్తావేజు లేఖరులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు పనిలేక ఉపాధి కోల్పోయే ముప్పు ఉందన్నారు. అందుకే తాము ఆందోళనకు దిగామన్నారు. పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహించాలని, దస్తావేజు లేఖర్లందరికీ లైసెన్స్‌లు ఇప్పించాలని కోరారు.

కొవ్వూరు: దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్ల కార్డులు పట్టుకుని లేఖరలు నిరసన తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ ఈ.వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ముప్పిడి నాగేశ్వరరావు, పాలేటి రవికిషోర్, పట్టపగలు వెంకటరమణ, నాళం సతీష్, వడ్డాది రాజబాబు పాల్గొన్నారు.

పలకా, బలపాల పంపిణీ

నిడదవోలు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఒకటో తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పలకలు, బలపాలు అందజేశారు. విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, గోపవరం, కోరుపల్లి, జీడిగుంట, పెండ్యాల, కలవచర్ల, మునిపల్లి గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వాటిని అందించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామారావు, పొలాదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, మానెం రాంబాబు, మారిశెట్టి అమ్మిరాజు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడుపల్లిలో ఫ్యామిలీ డాక్టర్

పెరవలి: మండలంలోని నడుపల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హేమరాజు 80 సాధారణ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే ఐదుగురు గర్భిణులకు, 89 మంది బీపీ పేషెంట్లకు, 68 సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందించారు.కార్యక్రమంలో సర్పంచ్ బీరా సత్యవేణి, సూపర్‌వైజర్లు జి. సత్యేంద్రకుమార్, కేవీ నాగేశ్వరరావు, పి జ్యోతికుమారి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగవరంలో బుధవారం అక్కడి యువకులతో సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు టి.నాని, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

నల్లజర్ల: మండలంలోని చాదరాశిగుంటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 14 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,400 స్వాధీనం చేసుకున్నట్టు నల్లజర్ల ఎస్ఐ బి.నరసింహమూర్తి తెలిపారు.

కొవ్వూరులో యువతి అదృశ్యం

కొవ్వూరు: పట్టణానికి చెందిన యువతి అదృశ్యమైనట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి. దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని ఆ యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమిశ్రగూడెం స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పురుషోత్తపల్లికి చెందిన బొడ్డు నాగరాజు (37) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 29న పురుగు మందు తాగాడు. అతడికి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి అత్యవసర వైద్యసేవలు అందించారు. అయితే బుధవారం ఉదయం నాగరాజు మృతి చెందాడు. దీనిపై అతడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.